
> చిన్నప్పట్నుంచి కొనసాగుతున్న నా రైలు ప్రయాణాలు,
> నా చుట్టూ జీవితంలో వేగవంతంగా వస్తున్న మార్పులు,
> ఆడవాళ్ల పట్ల మారని సమాజపు ఆలోచనలు, నాకెంతో పరిచయమైన
> శ్రీకాకుళం ప్రాంతపు స్త్రీల జీవితాలు, రకరకాల పేరులతో వలసపోతున్న
> వారి బ్రతుకులు అన్నీ కలిపి కథగా రూపొందాయి.

మన్నం సింధుమాధురి

15

# తూరుపు కండ

రాజు ఈపూరి





'యువర్ ఎటెన్షన్ ప్లీజ్, ట్రైన్ నెం. 17299 హౌరా నుంచి వాస్కో వెళ్లవలసిన అమరావతి ఎక్స్‌ప్రెస్ మరికొద్దిసేపట్లో రెండవ నెంబరు ప్లాట్‌ఫాం పైకి వచ్చును,' అని తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో జలుబు గొంతుతో ఎనౌన్సర్ చెబుతోంది.

చితచితా మంటలు లెగిసినట్టుగా, ఒక్కసారిగా అందరూ లేసి చేతులు, భుజాలు, వీపులు నెత్తిమీదకి సామాను మార్చుకుంటూ బిలబిలా కదిలారు. 'ఊగిచ్చుకుంటా పోతన్నావు మూటెత్తుకో,' అని మొగుణ్ణి కసురుకునే పెళ్లాం, అటూఇటూ పోయే పిల్లల్ని టపాటపా రొండు పీకి ఈడ్సుకుపోయే పెద్దాళ్ళూ, చెంబూ బొచ్చే మూటలు కట్టుకుని సంకలో బిడ్డలతో జనరల్‌లోకి పరుగులుపెట్టే వలస పొట్టలూ... రైలు రాకముందే సందడి సందడిగా ఉంది. రైలు ప్రయాణం అంటేనే చీదర మొదులవుద్ది. దరిద్రం కంపుకొట్టే ముఖ్య మయిన ప్రదేశాల లిష్టుల్లో ఇది మొదటిది. రైలు దిగేసినా రొండు తల్లంట్లకి కూడా వదలదు టాయ్‌లెట్ల వాసన. దుమ్మూ, కంపుతో ఉండే రైలుపట్టాలని బ్రిటీషోడు మన నడుములకి కట్టాడు. బస్సుకన్నా చవకగదా అని మనం పట్టాల పయిన పడ్డాం. ఈ సోదేంటి... ఎక్కడ... ఏ ఊరు?

స్టేషను: శ్రీకాకుళం రోడ్డు

లగేజీతో ఇద్దరం ఆడాళ్లం. నేనూ పెద్దత్తయ్యా.

"ఆళ్లు," అంది పెద్దత్త పక్కపెట్టెలో ఎక్కడానికి తోసుకుంటున్న పెద్ద గుంపుని చూసి.

"ఆలకి అలవాటే ఏ ఇజీవాడో ఎల్లేపుటికి సీటు దొరుకుద్ది."

'ఉహ్' అనుకుంటా లగేజ్‌తో లోపలకెళ్లి సీటు నెంబరు ఎతుక్కుంటన్నా. అప్పటికే ముగ్గురు, నలుగురు లెక్కన బెంగాలీలు ఒక్కో సీటులో నిండి ఉండారు. మురికితో కాఫీరంగుకి తిరిగిన బనీన్లు, నిక్కర్లు. ఒక్కళ్లు కూడా చొక్కాలు ఏసుకోలా.

"తేరా సీట్ నంబర్స్ క్యా హై బతావ్," అని కరుకు గొంతుతో అన్నా.

సీట్ల కింద చూస్తే లగేజీలకి ఖాళీ లేదు. మినుములు బస్తాలంత బరువుతో సూట్‌కేసులు ఉండయ్యి.

"నికాల్, సభీ నికాల్," అని రాక్షసిలాగా లగేజీలు బయటికి పీకుతున్నా.

ఒక అమ్మాయి, "వాస్కోదాకా ఎల్లాలి, వెయిట్ లిస్ట్... కొద్దిగా సర్దుకోండి," అంది హిందీలో.

"మేం కూడా హోస్పేటదాకా. వెయిటింగ్ లిస్ట్ వాళ్ల కోసం బాత్రూమ్ దగ్గిర అరలుండయ్యి పెట్టుకో... సర్దుకోవాలంట..." అని విసుక్కుంటూ మా లగేజి సర్దుతున్నా.

"అక్కయ్యా మేం కూడా తెనుగే, కలకత్తా తెలుగువాళ్లం."

గతుక్కుమని ఆ అమ్మాయివైపు చూశా.

మా పెద్దత్త నా చెవి దగ్గరకి వొంగి అంది, "ఈ ముండల్ని నమ్మొద్దు అన్ని బాసలూ వాగుతయ్యి."

రుసరుసా చూసింది ఆ అమ్మాయి.

బస్తాలతో ఎద్దులబండి కదిలినట్టుగా పోతంది రైలు.

కిటికీ పక్కన అత్తా, ఆమె పక్కన నేనూ కూర్చున్నాం.

"ఆళ్లుకి సీట్లు దొరికినయ్యంటావా," పెద్దత్త అడిగింది. పరధ్యానంగా తలూపాను బయటకు చూస్తా.

పాత చుట్టరికాలు పోతయ్యని అన్నయ్య కూతుర్ని శ్రీకాకుళంలో ఇచ్చాం. పెళ్లయినాక తప్ప, దాని ఇరవై ఏళ్ల జీవితంలో ఎప్పుడూ ఆంధ్ర మొకం చూసి ఎరగదు. అత్తింటాళ్ళు బాగా డబ్బూ పలుకుబడీ ఉండాళ్లే. దాన్ని ప్రేమగానే చూసుకుంటారు. అయితే దాని దగ్గిరకి ఎల్లిన ప్రతిపాలీ దీనికి సారె, చీర, ఎండికడ్డీనో, బంగారపు రేకో, ముక్కులోకో చెవులోకో మూతిలోకో కొనాల్సిందే. అదీ పీచుముదిరి, ఆంద్రా తాటికాయ లాగా అన్నీ వయినంగా పట్టుకెల్లుద్ది.

పైగా... 'బాప్పా మావోళ్లు ఎట్టకాకాదు, సూడకాకాదు, నేను ఎల్లంగాల్లే అందరూ సుట్టూ కమ్మి మీ మేనత్తలూ, బాబాయిలూ, అమ్మా, బాబులూ ఏం ఇరిపి ఎట్టకుండా ఉత్తి చేతులతో అంపారా అని అడుగుతారు,' అంటది. ఇంక మనకి మాటావాయీ పడిపోద్ది. అంత దూరం ఆడపిడతని ఇచ్చి ఇంత బద్రమయిన రోజుల్లో ఒక్కదాన్నే ఏం పంపుతాం అని ప్రతిసారీ దించటానికీ, తెచ్చుకోటానికీ ఎవరో ఒకళ్లుం డాలి. మా అన్నయ్య అయితే, 'రూపాయి కోడికి ఐదు రూపాయిల మసాలా అన్నట్టుగా పెళ్లి ఖర్చుకన్నా సార్జీల ఖర్చెక్కువయ్యిందే,' అని గోల. దాని బాప్ప అయినందుకు ఈసారి నాకు పడింది దాన్ని దించటం పని. ఇద్దరు ఎల్లగూడదని మా పెద్దత్త కూడా

ఎంట బయిల్దేరింది. దానిని అత్తారింటో వొదిలి, ఆళ్లు పెట్టిన చేప, మాంసం, బెల్లం ఆవకాయీ, పుట్టగొడుగుల కూరా తిని అరసవిల్లీ, శ్రీకూర్మం చూసుకుని తిరిగి రైలెక్కాం.

ఆలోచనలు ఎనక్కెళ్లాయి కేంపు వైపు.

**బూదిగుంపు కేంపు (కర్ణాటక)**

ఊరంతా కలిసి రొండొందల గడప. అందరూ బంధువులే. వంద పూరిళ్లు, యాభై రేకుల ఇళ్లు, యాభై డాబా ఇళ్లు. మాది కూడా ఈ ఊరే. చదువులనీ, ఉజ్జోగాలనీ పట్నం చేరిపొయ్యాం. మా చిన్న మావయ్య కొడుకు పెళ్లి విందుకని దిగాం. పెళ్లి తిరపతిలో జరిగింది. పెళ్ళికి ఎవరినీ పిలవలా. విందుకి మాత్రం పేరుపేరునా పిలిచారు. అందుకే పట్నం చుట్టాలందరూ దిగబడ్డారు.

ఏర్పాట్లు బెమ్మాణంగా జరుగుతున్నయ్యి. వచ్చినాళ్లని అత్తయ్యా, మావయ్యా పలకరిస్తన్నారు. ఆళ్ల కూతురు రాళ్లు, చెమ్కీలు, పూసలు, దారాలు, పిన్నీసులు, దబ్బనాల కుట్లు సమస్తం కుట్టిచ్చిన పాతికవేల పట్టుచీరని మోత్తా తిరుగుతంది.

టిఫిన్లు, కాఫీలు అయినాక పెళ్లికూతుర్ని పలకరిద్దామని గదిలోకి నడిచాం.

"పిల్ల పేరేంటో..."

"ఏదో పేరు, జాతకం కలవలేదని సుహాసిని అని నక్షత్రం ప్రకారంగా మార్చారు."

"ఏ ఊరు?"

"ఏదో పల్లెటూరు, మేనమామ కుదిర్చాడు. శ్రీకాకుళం అవతలంట."

"అమ్మానానలు ఏం చేత్తారు?"

"ఏం చేత్తారో... ఎవరెల్లారు? అన్నీ ఆ మేనమామే చూసుకున్నాడు. ఆయనే కుదిర్చాడు."

"పిల్లతరపు వాళ్లేరి, ఎక్కడ ఉండారు?"

"ఆళ్లకి తీరికల్లేవంట, అంత దూరం రాలేము అన్నారు. అమ్మా, బాబూ, మేనమామా ఆయన పెళ్లాం, ఇంకో ఇద్దరూ- పెళ్లికూతురితో కలిపి మొత్తం ఏడుగురు. ఆళ్ల తెలుగూ యాసా తేడా, పెద్దగా మాట్టాట్టల్లా. పిల్ల ఎర్రగా ఉందని, పెట్టుపోతలూ అడగలా. కాయా, కమ్మలూ, చీరా రవికా, బాసింగాలూ, గరికబుడ్డీ... అన్నీ మనయ్యే. తప్పదుగా," మా మేనమామ పెళ్లాం చెల్లెలు గలగల చెప్పింది.

తలుపు నెట్టుకుని పిల్లని చూట్టానికి ఎల్లాం. పిల్ల ఒక మూలన దిగులుగా ఉంది. ఆ పిల్లని చుట్టి మోకాళ్లు మీద తలలు పెట్టుకుని ఇద్దరు ఆడాళ్లు ఉండారు. పిల్ల తల్లి కుడిపైటని సర్దుకుంటా మాట్లాడాలా వద్దా అన్నట్టుగా మమ్మల్ని చూసింది.

“ఏం మాట్లాడుద్ది కొత్తకదా... సిగ్గూ.. అమ్మా... సుహాసినీ నమస్కారం చెయ్యి,” అంటా మళ్ళా వొచ్చి జొరబడింది మా మేనమామ మరదలు.

ఆ పిల్ల బొచ్చు కత్తిరిచ్చిన గొర్రెలాగా తలూపి, రొండు చేతులూ దగ్గిరకి తెచ్చి పైకి ఎత్తింది. సన్నగా కత్తిరిచ్చిన కనుబొమ్మలూ, కండీషనర్ చేసి పిన్నులు పెట్టి వదిలిన జుట్టూ, చాలా పద్ధతిగా కట్టిన చీరా, గోళ్లు పొడుగ్గా రంగూ, మేకప్... ఇయ్యన్నీ ఆ పిల్లకి ముందునించీ ఉండే అలవాట్లు అనిపిచ్చలా.

“ప్రయాణాలు చేసీ, చేసీ ఆళ్లకి అస్సలు నిద్దర్లు లేవు. రండి మళ్లీ ఒంటి గంటకల్లా రిసెప్షను మొదలవ్వుద్ది...” అంటా మమ్మల్ని బయల్దేరదీసింది మా మేనమామ మరదలు.

“ఏ ఊరంట?” అనడిగారు ఎనకమాల ఎవళ్ళో.

“తూరుపు ఏపువాళ్లు,” అన్నారు ఇంకొకళ్లు.

ఎటుకి, ఎటు తూరుపో అర్థంకాలా.

❖

రిసెప్షన్ సందడిగా ఉంది. చిన్నమావయ్య హడావిడిగా తిరుగుతున్నాడు. బచ్చలిపండు రంగు ఉప్పాడ చీర మ్యాచింగ్ బంగారు నగలతో అత్త మెరిసిపోతంది.

ఆంధ్రా చుట్టాలకి ఇష్టమని దావణగెరె నించీ దోసె మాస్టర్ని పిలిపిచ్చి కారం, బంగాళాదుంపల కూర పెట్టి నేతితో మసాలా దోసెలు ఏపిత్తన్నారు. ఒక పక్కనేమో మరమరాల ఉగ్గాణి, మిర్చిబజ్జీ, ఉల్లి ఆవకాయ ఘుమ ఘుమలాడిపోతంది. పుట్నాల పొడి, చిక్కటి పెరుగుతో పలారాల మోత, బాజాలకన్నా ఎక్కువ ఉంది. పెళ్లికూతురి మేనమామ, అతని పెళ్లాం కాస్త కలివిడిగా తిరగత టిఫిన్ల మీద పడ్డారు.

“పెళ్లికూతురు తరుపున జనాలు టిఫినుకి రాలేదేంటి,” అని ఎవరో అడిగారు.

“అయ్యో మావోలుకి ఒక అడుగు ఆలీసిం అయినా పర్లేదండీ,” అని ప్లేటు నిండా పెట్టుకుని లాగిత్తన్నాడు మేనమామ. కాసేపటికి పెళ్లికూతురు తరపు జనాలు బిక్కుబిక్కుమంటా వచ్చారు. ఏదో తిన్నాం అన్నట్టుగా చేతులు కడుక్కున్నారు.

“మీది సొగ్రామం ఏ ఊరంటా,” అని మాటలు కదలేసాడు కిష్ణాజిల్లా పెద్దమడిసి.

ఎమ్మటే మేనమామ మరదలు సీనులోకి దూకేసింది.

“రాజాం దగ్గిర. ఆళ్ల యాస, బాస వేరు, మనకి అర్థంకాదు. ఇంకా పిల్లని తయారు చెయ్యాలి, పదండి పదండి...” అని మందని మల్లేసినట్టుగా తొందరజేసింది.

ఇంతలో మా తమ్ముడి పెళ్లాం మూతి ఇరుసుకుంటా సీనులోకి వచ్చేసింది. దానికి మా చిన్న మేనమామ పెళ్లాం అంటే గిట్టదు, గుంటూరోళ్లని. అదీ, దాని ముత్తాతలూ గోదారినించీ వచ్చారు మరి.

"ఆడు పిల్ల మేనమామా కాదూ కడిగుడ్డూ కాదు. ఆడు తూరుపు పెళ్లిళ్ల బోకరి," మెల్లగా అని చుట్టూ చూసి, చిన్న మేనమామ పెళ్లాం లేదని నిర్ధారించుకున్నాక గొంతు పెంచింది. ' 'ఆ బోకరీ ఏం సేత్తాడేటి... కులం, గోత్రం సూడకుండా ఎర్రగా ఉండాళ్లని పట్టుకుని ఒకటే పొడుగు రైలు కదా ఎక్కుచ్చుకొత్తాడు. మ్యారేజీబ్యూరో అని బోర్డు ఎట్టి, నెలకి పదేలు పోసి ఇల్లు తీశాడు. ఎనకాల గదుల్లో ఈళ్లని ఉంచి, ఓ మూడు నెలలు ఇజీవాడోళ్లలాగా మాట్లాడతం, జుత్తులు కత్తిరిచ్చి కనుబొమ్మలు గోకేసి, మంచియ్యి నాలుగైదు జతల గుడ్డలిచ్చి, మగపిల్లోడు గల్లా ఓళ్లు వచ్చినప్పుడు నాలుగైదు లచ్చలకి బేరం కుదురుత్తాడు. ఓ లచ్చ పిల్ల అమ్మా బాబూ చేతిలో ఎడతాడు. ఇంకాళ్లు ఆ పిల్లని అమ్మేసినట్టే, మనం కొనుక్కున్నట్టే," పటపటా అనేసి లెగిసిపోయింది.

నాకెందుకో తలనెప్పిగా అనిపిచ్చి టీ తెచ్చుకుందాం అని దొడ్డి పక్కనించీ వంట ఇంట్లోకి వత్తన్నా. ఆ బోకరీ మేనమామ పిల్ల తరపు వాళ్లతో మాట్టాడతన్నాడు.

"మనెంపున ఇత్తే ఏం ఉంది, మడిలోన శాకిరి, ఇంటిలోన శాకిరి. సందాలకి సుక్కేసి పెళ్లాల్ని సితక్కొట్టేత్తారు. రేకిలగుడ్డకి కూడా ఆడదయి కూలిపనికి ఎల్లాల. ఇక్కడ అలక్కాదు, ఈల్లు గుమ్మందాటి బయటికి అంపరు. అత్తా మామా, బిడ్డలూ... సుకంగుంతారు," అని, కాస్త మందలింపు గొంతుతో, "ఆలు రమ్మంటేనే రండి. ఓ... అని వచ్చెయ్యమాకండి. శానా పేరున్నావోళ్లూ, ఎదురు రూకలు కూడా ఇచ్చేరు. ఇక్కడోళ్లందరూ ఒక కట్టు. మీరొచ్చి ఏటన్నా గోల చేత్తే, పీకలు నలిపీసి పెంటలో పాతేత్తారు," అంటా ఆళ్ల చేతుల్లో  రూపాయిలకట్ట పెట్టాడు.

"సార్జీలకీ ఇంకో పదేలన్నా ఇయ్యి సత్తిరాజా."

"ముందు ఈ డబ్బేట్టి ఇల్లు ఇడిపిచ్చుకోండి, రొండో పిల్లుంది కదా దానికి కూడగా  నేనే సూత్తాను. అప్పుడు ఓ పదేలు పెంచుతాను. రొండోపాలి కూత మడిసెక్క కొనుక్కుందిరిగాని, బాగుపడతారు. ఓ జిల్లా ఓళ్లం, తప్పుతదా. తానాలు ఆడి, ఆల్లిచ్చిన కోకలే సుట్టుకోండి. మీ దగ్గిరయ్యి బాగోవు. ఫొటోవులు తీత్తంటే ఓ అని తీర్థంలో కెల్లినట్టుగా రాకండి, పిలిత్తేనే రండి. రేపు రొండు గెంటల రైలుకి టిక్కట్లు తీశాను."

"సామి సత్తిరాజా ఇంకో పదేలన్నా ఇవ్వకుండగ మరీ కోత కోసేవు."

'ఇదే బొట్టు ఊరిలోన కడితే ఎంత ఖర్సయ్యేది. పిల్లకి బంగారాలు, పట్టు పొరుపుల మీద తేలే అదృష్టం పట్టింది. డొబ్బులు తిన్నంగా ఇంటికి వొట్టుకెల్లి ఫోను

కొట్టండి. ఎల్లండెల్లండి, తయారవ్వండి. సుబ్బరంగా తినాలి మరి,'' అంటా ఆ బ్రోకరీ మేనమామ ఎల్లిపోయాడు.

టీ గ్లాసు పట్టుకుని జామచెట్టు కింద కూచ్చున్నా.

"ఏంటొదినీ తలనెప్పా టీ తాగుతున్నారు, రోజూ టీ పుచ్చుకోరు కదా,'' అంటా మాలచ్చి వచ్చింది.

"కాదు టీ నెప్పి, తలని తాగుతున్నా.''

"మీరూ గోదారోళ్లలాగా క్యామిడీ సేత్తన్నారు.''

"అంత ఎటకారం మాకు లేదమ్మా.''

"ఇక్కడంతా ఎతికేరండి. ఎవ్వరూ పిల్లనివ్వలేదు, అందుకే సికాకుళం సైడు నించీ తెచ్చారండి.''

"ఇంకాపు,'' అని ఒక దులుపు దులిపా. ఎందుకో విసుగ్గా ఉంది.

"పిల్లాడు ఏం చేత్తన్నాడో,'' అన్నారు ఎవరో అటెళ్తూ.

ఎంటనే మాలచ్చి అందుకుంది, "ముందేం లేదండీ, అమ్మా, కొడుకూ సొసైటీ బియ్యం తిని బాబాయిగారికి ఆరోగ్యం బాగోదని నైస్ బియ్యం ఒండి పెట్టేవోరండి. ఎవరో తెల్సినోళ్లు ఇనపకొట్లో పనికి ఎట్టుకున్నారండి. ఎలా నేర్చుకున్నాడో కంప్యూటర్ ఆ కొట్లో నేర్సుకున్నాడండి. ఏదో పేకాట ఉంటదంటండీ, అందులో గెలవటం తప్ప ఓడిపోటం తెలియదంటండి. ఆడి డబ్బులే కాకుండగా జనాల డబ్బులతో కూడా ఆడతాడంటండీ, గెలిత్తే చెరిసగం పంచుకుంటారంట. అలాగ అసలేం లేనోలు... ఇప్పుడు ఇల్లూ, ఇంటినిండా సామానం, కారూ, బంగారం తెక్కొన్నేశారండి. ఇప్పుడు ఇంగో ఈ పెళ్లికి, పెళ్లికూతురికి అరకిలోదాకా పెట్టేడండీ. ఎలా సంపాదిత్తే ఏటండీ, సంపాదిత్తం మొదలయ్యింది. డబ్బునోడిదే రాజ్జెం.''

విందు బాగా జరిగింది. అందరికీ ఖరీదయిన చీరలే పెట్టారు. అప్పగింతలు పెట్టి ఎలతా, ఎలతా సికాకుళం పిల్ల తల్లీ పిన్నమ్మల శోకం శోకం కాదు. అవును మరి, తూరుపు ఆడాళ్ళూ, తుమ్మల బీళ్లూ బతుకంతా ముళ్లని మొయ్యటమే.

❖

ఛూఛూ... కూకూ...

రైలుమోతకి ఆలోచనలలో నించీ ఊడిపడ్డా. మనల్ని దాటిపోతన్న చెట్లూ, కొండలూ. చుక్కలు మెరిసిపోతన్నయ్యి. ఇటుపక్కకి తలతిప్పితే ఆ బెంగాలీ తెలుగమ్మాయిలు ఇద్దరూ నుంచునే ఉన్నారు. కాళ్లు పెట్టుకునే స్థలంలో సూట్‌కేసులు. పెద్ద కవర్‌లో కుక్కరు, నాలుగు గిన్నెలు. మాటిమాటికీ వచ్చి వాళ్లని చూసుకుని వెళ్తున్న ఒక మగమనిషి. ఏం గుర్తొచ్చిందో చెమ్మబారిన కళ్లని తుడుచుకుంటంది ఒక

అమ్మాయి. ఇద్దరి దగ్గిరా సెల్‌ఫోన్‌లు ఉన్నట్టు లేవు. ఎటోచూస్తూ నిలబడి ఉన్నారు. సైడ్ లోయర్ బెర్త్‌లో లావుగా, బొద్దుగా ఉన్నాయన కొద్దిగా జరిగి కూచ్చో అన్నట్టుగా చూశాడు. చిన్నది కూచ్చోబోతే వద్దని పెద్దది కూచ్చుంది. ఆడి మొకం ముడుచు కున్నట్టుగా వడిలింది. కాసేపుటికి ఆ పిల్లని మాటల్లో దించాడు.

"ఎక్కడికీ?"

"వాస్కో."

"ఏం చేత్తారు గోవాలో?"

"పనులకి."

"పెళ్లయ్యిందా?"

"లేదు. పక్కపెట్టెలో మా అంకుల్ ఉన్నాడు."

తుంచేసినట్టుగా సమాధానాలు చెబుతున్న ఆ పిల్లని అతని చూపులు తడుము తున్నాయి. ఆ పిల్ల ఎటు చూస్తందో కూడా అర్థం కాడంలేదు. కళ్లు తెరిచి ప్రపంచాన్ని మూసేసింది. కాసేపటికి లైట్లు తీసేశారు. మసకగా ఉంది. అందరూ నిద్రలో వున్నారు. తూగుతున్నట్టుగా అతను ఆ పిల్ల మీదకి వాలిపోతున్నాడు. ఆ పిల్ల కదలక మెదలక కుచ్చునే ఉంది. పై బెర్త్‌లోంచి గురక యినిపిస్తంది. కాసేపటికి ఆ తూంబోతు చేతులు ఆ పిల్ల ఒళ్ళంతా తడుముతున్నయ్యి. ఆందోళనగా నేను ఆ పిల్లని చూస్తున్నాను. ఆ పిల్ల బొమ్మలా అట్టాగే కుచ్చుంది. చిన్నది నిలబడే తూగుతంది. రైలు వంతెన మీదుగా వెళ్తోంది. ఆ పిల్ల డ్రస్సు లోపలికి ఆడి చేతులు ఎల్లినయ్యి. చున్నీ నిండుగా చుట్టు కుంది. ఆ పిల్ల వీపుమీద మొకాన్ని ఆనిచ్చి గెడ్డాన్ని రుద్దుతున్నాడు. రొప్పుతున్నాడు. చేప పొలుసు తీసే మేకుల చెక్క గుర్తుకొచ్చింది. రైలు వేగం పెరిగింది. ఇదేమి రోత పిల్ల అట్టా కుచ్చుంది... అనుకుంటా చూత్తన్నా. ఇంతసేపూ బొమ్మలా ఉన్న ఆ పిల్ల ఎనక్కి తిరిగి ఆడి చొక్కా జేబులోనించీ ఐదొందల కాయితం సర్రున బయిటికి లాగింది. వేగంగా వంగి కిందున్న పెట్టెలో దోపింది. ఇంతలో పయినించీ లావాటి ఆవిడ కిందికి దూకినట్టుగా దిగింది.ఆడు చేతులు తీసేసి బయిటికి ఎటో చూత్తన్నాడు.

"లేకి ముండలు, లేకి పనులు, ఇట్టాంటి ముండల్ని ఏసీ పెట్టెల్లోకి ఎక్కియ్యటం ఏంటి, సంసారాలు కూలుత్తారు," అని అరత్తా ఆ పిల్ల జుట్టు పట్టుకుని గుభీ గుభీ అని గుద్దింది లావాటి మనిషి. ఆడి పెళ్ళాం అనుకుంటా. ఆ పిల్ల ఎంటనే తిరిగి ఆ లావాటి ఆడమడిసిని నాలుగు పీకింది.

"అసలు నువ్వెవరవే టికెట్టు నా దగ్గిరా ఉంది. ఆడు నీ మొగుడయితే మీద చేతులు ఏసినప్పుడు ఎందుకు మాట్టాడలా?" అంటా లేచి నిలబడింది.

ఆమె ఇంక నోరు తెరవలా. "పైన పొడుకుని సావు..." అని మొగుడ్ని విసుక్కుంటా కింద బెర్తు మీద పొడుకుంది, మెడ నిండా పైటకొంగు చుట్టుకుని.

ఇంతదాకా నచ్చని ఆ పిల్ల మింద ఎందుకో ఇష్టం కలిగింది. కొద్దిగా జరిగి కుచ్చోమంటూ, "ఏంటి గొడవ," అనడిగా.

"ఆడు నన్ను పిసికినా ఫరవాలేదు అక్కయ్యా దానికి. మొగుడి జేబులో నించీ ఐదొందలు తీసుకోటం చూసి కిందకి దిగి గడబడ చేస్తంది," అంటా నవ్వింది.

"ఇంతకీ ఐదొందలు ఇచ్చేశావా?"

"నేనెందుకు వదులుతా. పంది నా కొడుకు."

పకపకా నవ్వాను. నాతో తను కూడా జత కలిపింది.

"ఇంతకీ మిమ్మల్ని చూసకెల్తన్న మడిసి ఎవరు?"

"మమ్మల్ని కాంట్రాక్టు కింద గోవా తీసుకెలతన్నాడు."

"ఎంత ఇత్తాడు?"

"నెలకి ముప్పై ఐదు వేలు, తిండీ, బట్టలు. అన్నీ మాయే."

ఇంతలో బండాగింది. గోదారి జిల్లాల్లో ఏదో స్టేషను అనుకుంటా. జనం ఎక్కుతున్నారు, దిగేవాళ్లు దిగుతున్నారు. ట్రిమ్ముగా టినోపాల్ ఏసి గెంజిపెట్టిన చొక్కా, ప్యాంటు, చొక్కాలోనించీ కనపడతన్న నల్లటి బెల్టు, విఐపి సూట్కేసు, వేళ్లకి ఉంగరాలు, నల్ల చెప్పులు, దూమెరుగ్గా నూనెరాసి పైకి దువ్విన తల... అతని ఎనకే తెల్లటి ఇస్త్రీ కాటన్ చీర, తెల్ల జాకెట్టు, దాంటోనించీ బిగుతుగా కనపడతన్న నల్ల బ్రా, తల నిండా మల్లెపూలు... ఒకావిడ వచ్చింది. చేతులకి ఏదో దుమ్మంటుకున్నట్టుగా పదేపదే దులుపుకుంటా బెర్తులు చూసుకుంటున్నాడు అతను. ఎదురు కింది బెర్తు, మధ్య బెర్తు వాళ్ళవి.

"ఏటి ఇదేనంటారా?"

"అందాకా కూచ్చో. కాత దూరం ఎల్లాక బోయినం కానిచ్చి సీటు దింపొచ్చు."

సూట్కేసూ, బ్యాగూ అడ్డదిడ్డంగా పడేశాడు. భోజనం క్యారేజీ మాత్రం చాలా జాగర్తగా సర్దుకున్నాడు.

"పేపరుకాయితంతో సీటు తుడుసుకుని కూకోండి. బట్టలు మాసిపోతయ్యి," అంది ఆమె.

"మాయకుండా ఉంటానికి మనిల్లేటి, మాత్తయ్యి మరి," అని మళ్లీ బట్టలు దులుపుకుంటూ మిగతావాళ్లు మెలుకుతో ఉండారో లేదోనని చూసి, చొక్కా నలక్కుండా జాగర్తగా పైకెత్తుకొని సీటుమీద కూచ్చుంటా, మా వంక చూసి...

"ఎక్కడదాకానంటారండీ..."

“తెల్లారేదాకా,” అన్నాను కొద్దిగా విసుగుతో.

“బలే క్యామిడీ, చాలా సర్దావోళ్లే. బంధువులింటికాండీ, సొంతూరా, తెలుగు బాగా ఆడతన్నారు, ఇక్కడోళ్లంటారా, అక్కడోళ్ళేనా.”

“అక్కడి వాళ్లమే,” అన్నాను.

“అదేలెండి, శానామంది పూరపురోజుల్లో ఎల్లారు. మా పిన్ని మాంగారి, కూతురు తోటికోడలి చెల్లెలిగారు కూడా తుంగభద్రలోనే కుదురుకున్నారు. ఆవిడ వరసకి మరదలు, కానీ వయసులో పెద్దోరు. కనక వదినా అని పిలుత్తానండి. చాలా ప్రేమగా ఉంటారండి, ఓపాలి రమ్మని వచ్చినప్పుడల్లా ఒకటే గొడవెట్టుకుంటారు,” అని నిదానంగా మాటల్లోకి దించి... పక్కనున్న ఆవిడని చూపిచ్చి,

“ఇది మా లేడీస్ అండీ, అంటే రొండో సంబందవండీ.”

సమాధానం కోసం ఎదురుచూడకుండానే,

“ఈరి అమ్మగారిది గుంటూరండి, ఈరి అమ్మగారి పేరుమీద రొండెకరాలు పొలం ఉంటే ఆడపిల్లలకి రాశారండి. ఆరి అమ్మగారు పోయినాక చెరొక ఎకరం మా లేడీస్‌కీ, ఆరి అక్కకీ ఇచ్చారండీ, అదమ్మితే తలకి ఓ మూడు కోట్లు వచ్చినయ్యండి, తుంగభద్రలో ఏవన్నా తక్కువలో ఓ పాతిక (ఎకరాలు) వత్తదని ఎలతన్నావండీ. మా బామర్దికి ఇడిగా ఓ ఐదెకరాలుందండీ... మొన్నటిదాకా కూరకాయలూ, ఆకుకూరలూ పండిచ్చి రైతుబజారుకి సప్లై చేసేవోడు. ఇప్పుడు ఓ ఎకరం అమ్మి ఇల్లు కట్టుకుని, పొలం చుట్టూ ఫెన్సింగ్ ఏపిచ్చి, మిగతా డబ్బులతో అపార్ట్‌మెంటులు కట్టిత్తా బిల్డరయ్యి, దర్జాగా కారులో తిరుగుతున్నాడండి.”

ఎంటనే సెల్‌ఫోన్ తీసి ఫొటో చూపిచ్చి... “ఇడు ఆడేనండీ, ఈ సెల్లు కూడా ఆడే ఇచ్చాడండి. ఏదీ మూణ్నెల్లు మించి వాడడు. అన్నీ కొత్తమోళ్లే కావాలండీ ఆడికి. ఇంట్లో ఓ లచ్చెట్టి టీవీ, లచ్చ రూపాయిల ఫ్రిజ్జు, లచ్చెట్టి సోఫాసెట్టూ, డబల్‌కాటు మంచాలు చేయించేసేడండీ, సింపుల్‌గా ఉండే పిల్లకోసం చూత్తన్నాడండి. బాగా చదువుకున్నోళ్లయితే మాట ఇంటల్లేదండీ. అదేనండీ సాయంత్రం 7 నుంచీ 8 మధ్యలో వత్తాది కదండీ టీవీ సీరియల్ అందులో హీరోయిన్ ఏసుకున్న నగలన్నీ పెడతాడండీ, నా ఫోన్ నెంబర్ తీసుకోండి... మంచి సంబందం ఉంటే చూసి ఫోన్ కొట్టండి.”

ఈ గోలకి మా పెద్దత్త లెగిసినట్టుంది..

“ఈడి కలుపుగోలుతనం గోదాట్లో కలవ. సామాన్లూ, నగలూ, జాగర్తగా ఉంచుకోవాలి,” మెల్లగా అని మెడలు సర్దుకుంటా, పైట కప్పుకుంది.

"మీ క్యాంపెక్కడంటారా, సొంత పొలాలా, అయితే ఎంతుంది, కౌలుకౌతే ఎకరానికి కౌలు ఎంత? మీ ఊరి దగ్గిర పొలాల రేటెంత? ఆడపిల్లలు పెళ్లిళ్లకి దొరుకుతారా..." మొత్తం గోదారి కూపీ తెలివితేటలన్నీ ఒకేసారి కక్కుతున్నాడు.

మా పెద్దత్త ఇసురుగా, "మాకే పిల్లలు దొరక్క సత్తన్నాం. అయినా సదువూ ఉజ్జోగాలూ లేకుండా రియలెస్టేటూ, కంప్యూటర్‌లో పేకాట అని తిరిగే మొకాలకి ఇవ్వాళరేపు పిల్లనెవరు ఇత్తన్నారు. మా క్యాంపుల్లో పెళ్లికాని మొగపిల్లలు, ఒక్కో క్యాంపుకీ యాభైదాకా ఉండారు. ముప్పైలు దాటి ముదిరిపోతన్నారు. అయినా అక్కడి వాళ్లం ఆంధ్రావాళ్లకి పిల్లనివ్వం. ఎంతసేపూ డబ్బుని గోతాల్లో, బంగారాల్ని కేజీల్లో తూత్తా... మీరంటే మాకు భయ్యం, తుళ్లూరు చుట్టుపక్కల పిల్లలకే పెళ్లిళ్లు అవక అల్లాడతంటే, మీ గోదారి సంబంధం కోసం దూకితే పెట్టుపోతలూ, సారెలూ, లడ్లూ, ఇత్తడి సామానులూ, ఆవకాయ పచ్చళ్లూ, పెట్టలేక పిల్ల అమ్మా, అయ్యా చత్తారు," అనేసింది.

"అంటే  గుంటూరు, కృష్ణా జిల్లాలే గైరంటారా, మా గోదారికన్నా."

ఈ సంభాషణకి చుట్టుపక్కల వాళ్లు లెగిసి మావంక చూత్తన్నారు. చనువిత్తే బోగీ మొత్తం టాపిక్కులోకి ఎగిరి దూకేటట్టుగా ఉండారు.

"నిద్దర... పొడుకుందాం," అని పెద్దత్తతో అన్నా, మాటలు ఇంక వద్దన్నట్టుగా.

అతను మా మొకాలెంక చూసి, "ఇంకెందుకూ భోనం క్యారేజీ తియ్యి ఓ పని అయిపోద్ది," అన్నాడు.

ఆవిడ భోజనం క్యారేజీ అరిటాకుల కట్టా బయటపెట్టింది.

"యాండీ పీతల పులుసూ, పలావు అన్నం. కొద్దిగా తినండి. రేపు ఎన్నింటికెలతా మోనని, దారిలో భోనం బాగోదని టిఫినుకారలో ఓ ముద్దెక్కువ కట్టమన్నానండీ. మా లేడీసు నీసు వంటలు బాగా చేత్తారండి."

రైలు మార్కాపురం దాటినట్టుంది. చిన్నగా అడివి మొదలయింది. ఇద్దర మ్మాయిల్లో ఒకమ్మాయి నా బెర్తు పక్కన  కింద  కూచ్చుంది.  ఇంకో పిల్ల  నుంచునే ఉంది. ఆ మొరటుమనిషి అరగెంటకి ఒకసారి వచ్చి ఈళ్లని చూసి పోతన్నాడు.

అతని జేబులో ఫోన్ మోగింది. "ఊ... ఊ... నా దగ్గిరే ఉంది. తొందరగా పెట్టెయ్యండి," అని హిందీలో చెప్పి ఆ పిల్ల చేతికి ఫోన్ ఇచ్చాడు. బంధువులతో అనుకుంటా పిట్టలకి గింజలు ఇసిరినట్టుగా మాట్లాడి ఫోన్ తిరిగి ఇచ్చేసింది.

ఒక కొత్త కుర్రాడు పెట్టెలోకి ఎక్కాడు. పాతికేళ్లకి ఒకటో రొండో ఎక్కువుండచ్చు. చుట్టూ పరికించి, నుంచున్న అమ్మాయిని ఆనుకుని నిలబడ్డాడు. ఆ అమ్మాయి దూరం కూడా జరగలా. కుర్రాడు ఆ పిల్లతో కళ్లతో మాట్టాడ్డం మొదలెట్టాడు.

ఆ పిల్ల, "ఎక్కడ?" అంది కాస్త గొంతు తగ్గిచ్చి.

టాయ్‌లెట్‌ల వైపు చూపించాడు కళ్లతోనే.

"కానీ, ఎయ్యి రూపాయలు."

అంత లేవు అన్నట్టుగా ఐదు వేళ్లు చూపిచ్చాడు. ఇద్దరూ ఒకేమాలు చుట్టూతా చూశారు. ఎవరూ మొలకూతా లేరనుకున్నాక టాయ్‌లెట్ల దిక్కు నడిశారు. నా బెర్తు పక్కన కింద కూసుండా అమ్మాయి తనకేం సంబంధం లేనట్టుగా తూగుతా ఎనక్కి ఆనుకుంది. కుతూహలానికి నాకే చిరాకనిపిచ్చి బయటకి చూస్తన్నా.

రైలు సొరంగంలోకి దూరింది. చీకటి... వింత శబ్దం. మనసు వికలమయి గుంటూరు వైపు పొయ్యింది. దివ్య గుర్తొచ్చింది. పెద్దమ్మ కరోడా గొంతు ఇనపడతున్నట్టే ఉంది.

**గుంటూరు పక్కన ఒక పల్లె**

"ఆరు గంటలయినా నిదరేంటి, తెల్లారింది కూడా సోయలేదు. కూటికి గతీ దారుడ్డం లేనిదాన్ని కోడలుగా తెచ్చుకుంటే ఇంతకన్నా ఏం అదృష్టం ఉంటది. అరవై ఆరూ, ముప్పై మూడూ అవిర్చి తెచ్చుకుంటే నెత్తికెక్కుతారు. పొద్దిన్నే లెగిసి, చచ్చేటట్టు చాకిరీలు చేసుకుని, కూలికి లాక్కుపోయే పనయితే ఒళ్లు సమ్మగా ఉండేది. నీళ్లు మోసుకుంటా, ఏరిగింది డిప్పల్లో ఎత్తి పోసుకుంటా బతికే జాతిని, పొరుపుల మీద పొర్లిత్తంటే సుఖంలేక నిద్దరపట్టక మెలుకూ రాదు," అని దండకం ఎత్తుకుంది అత్త.

అత్త అరుపులకి ఉలిక్కిపడి మెలుకువ వొచ్చి, నడుంమ్మీద మొగుడు మెలేసిన చేతిని ఇడిపిచ్చుకుని, పిల్లాడు తడిపిన పక్కలు తీసి గది బయటకొచ్చింది కోడలు. చీపురు మొదళ్లు గోడకి కొట్టి పాసి చేసి, గుడ్డలు రొండు బక్కీట్లకి నానబెట్టి, అంట్లు బయట ఏసి, ముగ్గుగిన్నె చేతిలోకి తీసుకుంది.

ఈ లోపల అత్తగారు స్నానం చేసి ఇస్త్రీ గెంజిచీర కట్టి, పూజ చేసుకుని, ఫిల్టరు కాఫీ కలుపుకుని, కొడుక్కీ, తనకీ రెండు కప్పులు పట్టుకుని వచ్చి దర్జాగా కుర్చీలో కూచ్చునింది.

"దివ్యా పొయ్యి గట్టుమీద కాఫీ ఉండయ్యి తాగు," అనింది.

కాఫీగ్లాసు అందుకునేలోపే పిల్లాడు ఏడుపు ఎత్తాడు.

"పెందలకాడే లెగిత్తే పనులు కావూ... నా నోరు బయటపడటం తప్ప, ఎవరి కోసం... ఈ మేడా, పదెకరాల పొలం, పదేనెకరాల మాగాడి, ట్రాక్టరు, కారూ, బండీ, నేను కట్టుకుపోతానా...? ఒక్కగానొక్క కొడుకు... ఏం చేత్తాం... చదువుకుందీ, డబ్బులు తెచ్చేదీ కోడలుగా వచ్చుద్దనుకున్నా... రాతని తప్పిత్తామా. 'బుద్ధులు భూమిని ఏలతంటే

రాతలు గాడిదలు కాత్తన్నట్టు,' పిల్లాడికి అత్తగారింటికెళ్లి నాలుగు రోజులుండి రొండు మెతుకులు తినే యోగంలేదు.''

ఎంతసేపూ దానరేఖలూ, గుప్పిళ్లు ఇప్పటాలూ మా ఏపున రోజూ చదివే దండకమే ఇది. కోడలు కన్నెత్తి చూడదు. పన్నెత్తి మాటాడదు.

ఇంతలో ఫోన్ మోగింది. అత్త అందుకుంది.

''హలో,'' అంది. మొకంలో రంగులు మారియినయ్యి అవతలి మాట యినగానే.

''ఇదిగో నీకెన్నిసార్లు చెప్పాలో దాలయమ్మ కాదు దివ్యా అనమని. అయినా ఏంటి పద్దపద్దాకా ఫోన్లు. తీర్థాలూ, తిరనాళ్లూ ఏగటానికి మేం చిల్లరగాళ్లలాగా కనపడతన్నావా... వచ్చి నీ కూతుర్ని కావాలంటే తీసుకెళ్లు, మా మనవణ్ణి పంపం. వత్తా వత్తా... ఆ ఎండుచేపలూ, ఉప్పు చేపలూ, దిక్కుమాలిన వడియాలూ ఏసుకు రామాక. కొంపంతా కంపు. నువ్వొత్తే ఆ జాకీటు ఏసుకుని తగలడు,'' అని విసుక్కుంటా, దివ్యకి ఫోన్ ఇచ్చింది.

పరుగున ఫోనందుకుంది దివ్య.

''యమ్మో ఎలగున్నరే...''

''గౌరి, సిరిలచ్చిమి, పుల్లెంకి అందరూ ఎలగున్నరే, బేగ రాండే.''

ఊళ్లో తీర్థం అనే మాట ఇనంగానే దివ్యకి ఎగిరి గంతెయ్యాలనిపిచ్చింది. తన సావాసగత్తెలు, అమ్మోరి గుడి, తీపివంటలు, తన బాస, యాస... అన్నీ గుర్తొచ్చి ఒళ్లు మరిచిపోయింది.

❖

గిన్నెలన్నీ తోమి బట్టలు సగం ఉతికింది దివ్య. ఇంతలో పిల్లాడు ఏడుపు అందుకున్నాడు.

''ఏయ్ ఎక్కడ సచ్చావు. ఇంకా బొచ్చెలూ, గుడ్డలేనా. పిల్లాడి ఏడుపు ఇనపడటల్లా... శనిమొకం. నా మనవడికి ఎక్కడో ఊరూ పేరూ లేనిదాని పాలు తాగాల్సిన ఖర్మపట్టింది.''

బయట కారాగిన శబ్దం.

''రాయ్యా... రా... ఒంటిగెంటయినా నీళ్లా, నిప్పులా, నీ కష్టంతో బీరువాడు చీరలు కొన్నావా, ఒక్కనాడన్నా అణ్ణపేలకి పని తెవిల్చి, స్నానం చేసి చీర కట్టుకుని పూలు పెట్టుకుంటదా... అబ్బేలేదు. ఎంతసేపూ ఆ ఊరి ఫోను మీదే మనసు. అక్కడ మడులూ, మాన్యాలూ ఏం వదిలి వచ్చిందో... ఏం తక్కవ జేశాం... నల్లపూసలు,

రొండరసల తాడు, రొండు, రొండు జోళ్ల లెక్కన గాజులు, నక్లీసు, హారం, మొన్నటికి మొన్న చేయించిన వడ్డాణం... మనకి రాతలు తప్ప."

"అమ్మా... అన్నం పెట్టు," అని పిల్లాడిని ముద్దు పెట్టుకుని టేబుల్ ముందు అమ్మా కొడుకూ అన్నం తిని ఆఫీసరులాగా కారేసుకుని ఎల్లిపోయాడు.

స్నానం చెయ్యాలని బీరువా దగ్గిరకెల్లి తెరిచి చూసింది. అన్నీ రొండు వేల పైన ఖరీదయిన చీరలే, పనిచేసి, చేసి చితచితలాడతందని కాటన్ చీర తీసుకుంది.

అది చూసి అత్త ఇంతెత్తున లేచింది.

"ఆ లేకిమంద పెట్టిన దరిద్రపు చీరతో తప్ప, నా కొడుకు కంటికి నిండుగా కనపడవా... ఛీ... ఛీ..."

"మెత్తగా ఉందని తీశాను."

"నాకు తెలవదా ఇటియ్యి ఆ సీద్రం," అని చీరని లుంగలు చుట్టి మైలగుడ్డల పెట్టెలో ఏసింది. పిల్ల మనసు విలవిలలాడింది. అది ఆళ్ల అమ్మ వరికోతలకి ఎల్లి తాగుబోతు అయ్య కంటపడకుండా డబ్బులు దాసి కొన్న చీర. ఎప్పుడూ ఇంతే. బయటకెళ్లినా చీరలూ, నగలూ దిగేసుకుని అత్తగారితోనే ఉండాలి. తనని ఎవరైనా పలకరిస్తే ఆమే సమాధానాలు చెప్పుద్ది. వంటా వాళ్లదే, చుట్టాలూ వాళ్ల తరపువాళ్లే. ఒకవేళ తన తరుపు బందువులు వచ్చినా వరండాలో నవ్వారు మంచాలు లేదా తుంగచాపలు. కనీసం పక్కింటికి ఎల్లే అదృష్టం కూడా లేదు. పుట్టింటికి పంపినా నగలన్నీ ఒలుచుకుని పంపుతారు. గెంట గెంటకీ ఫోన్లు. ఊళ్లో పరిస్థితులు ఏమీ బాగోలేదు. అయ్యకి కూలి డబ్బులు తాగటానికే చాలవు. తన పెళ్లికి అత్తింటి వాళ్లిచ్చిన లక్ష రూపాయలతో కొన్న మూడు ఎకరాల వరి చేను పండితేనే తిండి గింజలు. తల్లి పొలాల్లో పనిచేసిన డబ్బంతా దాసి తమ్ముణ్ణి చదివిస్తుంది. తనని అత్తారింటి నుంచి యాడాదికి ఒకనాడు తీర్థానికి పిలుచుకెల్లుద్ది. క్రికెట్టు బెట్టింగుల్లో డబ్బులు వచ్చిన నాడు సంసారం. లేదంటే అమ్మా కొడుకూ శివాలే. ఇప్పుడికి మూడుసార్లు జైలుకెల్లాడు. ఆలోచనలతో బాత్రూమ్‌లోనించి బయటకొచ్చింది.

"నేను మజ్జానం రొండయినా కూడూ కుమ్మూ, ఎయ్యలేదని ఇరుగు పొరుగు వాళ్లు అనుకోవాలా, ఆళ్ల కోటరికాలు వదిలి ఈ మంద కళ్లన్నీ నా కొంపమీదే. రా మెక్కు. తిని పడుకో, నీరసం వత్తే సాయంత్రం పనిచెయ్యలేవు."

❖

అప్పుడప్పుడే కన్ను అంటుతోంది. టాయ్‌లెట్ల దగ్గరకి వెళ్లిన కుర్రాడు గబగబా వచ్చి, తన బ్యాగ్ తీసుకున్నాడు. ఎనకనే ఆ పిల్ల వొచ్చింది.

అప్పటికే వచ్చి అక్కడున్న మొరటుమనిషి, పెడీల్‌మని ఆ పిల్ల ఈ చెంపా ఆ చెంపా వాయించాడు. గుభీ గుభీమని ఎదురొమ్ముల మీద గుద్దుతా రొప్పుతా, "అప్పుడే సొంత యాపారం మొదలుపెట్టావా," అని బూతులు తిడతన్నాడు.

కుర్రాడు పరుగున వెళ్లిపోయాడు. అంత దెబ్బల్లోనూ కుర్రాడు డబ్బులు ఇవ్వకుండా ఎల్లిన పక్కకి చూత్తంది ఆ పిల్ల. నేను లేచి లైటు ఏశాను. ఆ మొరటాడు తప్పుకున్నాడు. నా కాళ్ల దగ్గర కూచ్చున్న అమ్మాయి అడ్డం ఎల్లటంగానీ, ఆపటం కానీ చెయ్యలా.

"ఇంత కాపలా ఏంటి? గోవాలో ఏం పని చేత్తారు?" అనడిగాను ఆ అమ్మాయిని.

"పగలు ప్యాకాట క్లబ్బుల్లో పేకలు కలపటం, మందు అందిచ్చటం. రాత్తిరికి వచ్చిన మగాళ్లతో పొడుకోటం," ఆ గొంతులో ఏ భావమూ లేదు.

నా ఆసక్తిని గమనించి చెప్పడం మొదలుపెట్టింది. "ఇంటోవాళ్లకి అడ్వాన్సులు ఇచ్చి ఈ సూట్‌కేసుల్లో బట్టలు కొనిచ్చి, సంవత్సరం కాంట్రాక్టు కోసం తీసుకెలతన్నాడు. పోలీసు గొడవులూ, రోగాలొత్తే హాస్పటలూ వొచ్చినోళ్ళు గాయాలు చేత్తే మందులూ అన్నీ చూత్తాడు."

"రోజుకి ఎంతమందిని పంపుతాడు."

"పంపితే, పడుకోవటమే అయితే భరించొచ్చు. వాళ్ల దెబ్బలు, డ్రగ్స్, గాజు పెంకులతో గాయాలు, ఇద్దరు ముగ్గురు ఒకేసారి..." ఆమె గొంతులో బాధగానీ, భయంగానీ లేవు.

ఆ మాటలు నాలోపల ఎక్కడో గుచ్చుకున్నాయి. గుండెల్లో దడ వచ్చినట్ట య్యింది. కడుపులో తిప్పుతున్నట్టయ్యింది. లేచి బాత్రూమ్‌కి ఎల్లాను. తలుపు తీసుకుని బయటకొస్తంటే ఇందాకటి కుర్రాడు నిలబడి ఉండాడు. నా చేతిలో ఐదొందల కాయితం ఉంచి, "ఆమెకివ్వండి. ఇదిగో దీంట్లో నా ఫోన్ నెంబరుంది. తను నాతో వచ్చేస్తానంటే గుంతకల్లు స్టేషన్‌లో దిగమనండి," అని గబగబా పక్కపెట్టెలోకి మారాడు.

చేతిలోని నోటూ, దానిమీదున్న పదమూడు భాషల రాతా నన్ను చూసి నవ్వినట్టుగా అనిపిచ్చింది. బెర్తు దగ్గరకు రాగానే ఆ పిల్ల చేతికిచ్చాను.

"థాంక్స్ దీదీ," అంది.

❖

తెల్లారింది. ఇంకో పది నిమిషాల్లో బళ్లారి వచ్చుద్ది అనంగా ఆ మొరటు మనిషి చెమటలు కక్కుతా, "ముండలు, లంజలు తప్పిచ్చుకున్నయ్యి. దొరకనియ్యి

ఖైమా కొడతాను. ఎక్కడిదాకా ఎల్లి దాక్కుంటయ్యి," అని సూట్‌కేసులని దొర్లిత్తన్నాడు. వంట సామాను ధమధమా మోగినయ్యి.

లెగిశాక చూత్తే ఇద్దరూ లేరు. ఎక్కడ ఉండా వాళ్లు సుఖంగా ఉంటే బాగుండు అనుకున్నా. కానీ ఎమ్మటే వొణుకూ, భయం. దొరికితే వాళ్ల పరిస్థితి...? కళ్లు మూసుకుని అలాగే ఎనక్కి వాలాను.

పేరేదైతే ఏం? అది పెళ్లయినా, కూపాల్లోకి దించినా బతుకంతా ముళ్లని మోసే తూరుపు ఆడాళ్ల వలస బతుకుల శోకం గుర్తొచ్చింది.

గంటకి హొస్పేట వచ్చింది. పెద్దత్తయ్యా నేనూ దిగాం. దిగేవాళ్లూ, ఎక్కేవాళ్లూ... లగేజీలు... జాగ్రత్తలు, అరుపులు... కాకరబీకరగా ఉంది. నడుసుకుంటా కదిలాం. రొండు చేతుల్లోనూ లేగేజి బరువెక్కుతా ఉంది. ఆగి బ్యాగులు కిందకి దించి ఎనక్కి చూశా. ఇంజను బుసలు కొడతా బొయ్యిన అరిచింది. ఒకళ్లూ ఇద్దరూ కాదు, వేలూ లక్షల కేజీల తూరుపు కండల్ని మింగి అరిగించుకునే రాకాసి కొండచిలువలాగా భారంగా ముందుకు కదిలింది రైలు.

*ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక*
*డిసెంబర్ 2016*

✻



మన్నం సింధుమాధురి పుట్టింది గుంటూరు జిల్లాలో అయినా, పెరిగింది మాత్రం కర్ణాటకలోని ఉళైనూరు క్యాంపులో. 25 డిసెంబర్ 1973న పుట్టిన వీరి తొలి కథ *తుంగభద్రని ముంచెత్తిన వాన* సాక్షి దినపత్రికలో 2009లో అచ్చయింది. పదిహేను కథలు రాశారు. ఆంధ్రజ్యోతి ఆదివారంలో 20 వారాల పాటు ఉళైనూరు క్యాంపు కథలు ధారావాహికంగా వచ్చాయి.

*చిరునామా: D/o డా॥ ఎమ్. సుబ్బారావు, ఉళైనూరు క్యాంపు,*
*కొప్పళ్ జిల్లా, కర్ణాటక*
*ఫోన్: 87909 06686* **sindumaduri29@gmail.com**